మందుల విక్రయం మంచిదే కొంగుడం కాదు

— పొడుగు సత్యానందాచారి

మధు అందగాడు.

అందమైన నొక్కుల జుట్టు, విశాలమైన నుదురు, కొనదేలిన ముక్కు, కళ్ళలో మెరుపు, పెదవుల మీద చిరునవ్వు, ఫారిన్ షర్ట్ పాంట్‌ల టకప్, షర్ట్ జేబుల మధ్య అందంగా అతికించబడిన 'ఐ లవ్ యూ' స్టిక్కర్, బొద్దు మీసాలు ముద్దుగా ఉండి, దబ్బపండు చాయలో దర్జాగా ఉంటాడు. ఆధునికం వాంఛించే ఎవరైనా ఆ మాట అనక తప్పదు.

కాలేజీలో చదివే అందరిచేత 'అందగా' డని సర్టిఫికేట్ తీసుకున్నాడు మధు.

అందుకే ఎందరో అమ్మాయిలు మధు పొందంటే జీవితంలో మధురమైన విందు అనుకుంటారు.

వసంత, రాగిణి, రమణి, షీలా, సుశీల, లలిత, పద్మ... ఇలా ఎంతో మంది మధును ప్రేమించారు. కాని, మధుమాత్రం ఎవరినీ ప్రేమించలేకపోయాడు. కారణం అతడి దృష్టిలో అతడికి తగ్గ అందగత్తె ఎవరూ లేకపోవడమే!

ఎంతోమంది అమ్మాయిలు తనకు చేరువ అవుతున్నా, సరి అయిన అందగత్తె పొందు ఎప్పుడు లభిస్తుందా? అని ఎదురు చూస్తున్నాడు మధు.

ఉద్యోగం పురుష లక్షణం అన్నట్టు కనిపించే ప్రతి వాంటెడ్ ప్రకటనకు అక్కరకురాని అప్లికేషన్స్ పంపేశాడు మధు. హైదరాబాదులో ఒక పేరు పొందిన పెద్ద మందుల కంపెనీ మధు అప్లికేషన్‌కు అదృష్టం పట్టించి ఇంటర్వ్యూ అయిన తరవాత వారంరోజుల్లోగా డ్యూటీలో మెడికల్ రిప్రెజెంటేటివ్ చేరమని ఆర్డర్స్ పంపింది.

* * *

భువనేశ్వర్ ఎండి బంతిలాగా ఎగురుకుంటూ బయలుదేరింది కోణార్క్ ఎక్స్‌ప్రెస్.

ఒకసారి రైలు పెట్టె అంతా కలియజూసి నిరుత్సాహపడిపోయాడు మధు. కారణం—చుట్టుపక్కల ఏ అందమైన అమ్మాయీ కనబడకపోవడమే. ఎదురుగా ఉన్న ఖాళీ బెర్తులు కళ్ళు మూసుకుని పడుకొని ఉన్నాయి.

మధుకు ఉద్యోగం దొరికినందుకు సంతోషంగా ఉన్నా స్నేహితులందరిని వదిలి ఒక్కసారిగా బయలుదేరి రావడం ఎంతో దిగులు కలిగించి మనసంతా కల్లోలంగా తయారయింది.

చందమామ తన చుట్టూ ఏడు రంగులు పులుముకునికిటికీలోనుండిరైలు పెట్టెలోకి పడుచు పిల్లలాతొంగిచూస్తూంది. చల్లగాలి రివ్వున సంగీతం పాడ తూంది.

చందమామను చూస్తూ ఆలోచనలో పడిపోయాడు మధు.

చందమామ వెలుగులో ఎంతో మంది అమ్మాయిలతో సరదాగా కాలం గడిపాడు. తను ఎక్కడైనా ఉన్నాడంటే తన చుట్టూ అమ్మాయిలు గలగల నవ్వుతూ మాట్లాడేవారు. వెన్నెల్లో గడిపిన జ్ఞాపకాలు మనసులో మెదిలాయి.

వసంతకు వెన్నెల అంటే ఇష్టం. ఆ రోజు ఫ్రెండ్సంతా కలిసి మేఘాద్రి గడ్డకు పిక్నిక్ వెళ్ళినప్పుడు తను, వసంత కలిసి గడిపిన కొన్ని గంటలు ఎంత మధురమైనవి!

సాయంకాలపు నీరెండలో ఎత్తైన బండరాయి మీద కూర్చుని గలగల పారే సెలయేరును చూస్తూ, "మధూ! జీవితమంతా ఇలానే ఉండిపోదాం" అని వసంత అన్నప్పుడు తను పేలవంగా మాత్రమే నవ్వగలిగాడు.

పిక్నిక్ నుండి తిరిగి వస్తూ బస్సులో ఒకరి నొకరు ఆనుకొని కూర్చున్నప్పుడు — "మధూ! ఆ చందమామను చూడు నీలాగే ఎంత అందంగా మెరిసిపోతున్నాడో!" అంటూ కనులు మూసుకొని తనివి తీరా తనను వసంత ముద్దు పెట్టుకున్నప్పుడు తను ఏమీ పట్టించుకోలేక పోయాడు. కారణం వసంత కంటె అందమైన అమ్మాయి జీవితంలో దొరుకుతుందని ఆలోచించడమే.

బహుశా ఇలాంటి సమయాల్లో అలాంటి అనుభూతులే చాలా ఆనందాన్ని తెచ్చి పెడతాయి. అప్పుడు ఖాతరు చెయ్యని అనుభూతి ఇప్పుడు ఎంత ఆనందంగా ఉంది! మనిషి ఎదురుగా ఉన్నప్పుడు చులకనగా చూసి, ఆ మనిషి దూరమైనప్పుడు విచారపడిన్ లాభం ఏముంది?

రైలు ఏదో స్టేషన్‌లో ఆగింది.

పోర్టర్స్ కేకలు ఎలక్షన్ల ముందు రాజకీయ నాయకుల ఉపన్యాసంలా వినబడుతున్నాయి.

వూహాలోకంలో తేలిపోతున్న మధు ఎదురుబెర్తు మీదికి ఆరవై ఏళ్ళ వృద్ధుడు, ఇరవై ఏళ్ళ పడుచు రావడంతో వూహలను వాయిదా వేశాడు.

మధు ఆ పడుచు అందాన్ని చూసి మేనకను చూసిన విశ్వామిత్రుడులా నవ్వుకున్నాడు.

ఆమె నల్లటి పూలున్న తెల్లటి జార్జెట్ చీర మీద నల్లటి బౌజు వేసింది. ఉంగరాల జుట్టు వంపులు తిరిగి ఒయ్యారాలు ఒలకపోస్తూంది. రంగులా ఉన్న జుత్తు నొసటిమీద నాట్యం చేస్తూంది. పెదవులమీద లిప్‌స్టిక్, ముక్కున నత్తు, చెవుల మీద ముల జోడు, ఎర్రటి గోళ్ళ రంగు, పంచదార రంగు పలువరుసు, కైపెక్కించే కళ్ళు, మత్తెక్కించే పూలు ఆమె స్వంతంగా ఉన్నాయి. చిన్నసైజు హాండ్‌బాగ్ చేతికి తగిలించుకుంది.

స్వర్గలోకం నుండి డైరెక్టుగా ట్రెయిన్‌లోకి వచ్చిన రంభలా ఉంది.

బెర్తు నంబర్లు చూసుకొని క్రింది బెర్తు మీద ఆమెను పడుకోమని చెప్పి, పై బెర్తు మీద నిద్రకు ఉపక్రమించాడు ముసలాయన.

సూటుకేసులోంచి గళ్ళ దుప్పటి తీసి సీటుమీద పరుచుకుందామె. సూటుకేసు బెర్తు అడుగున సర్దేసి, బెర్తు మీదికి వచ్చి కూర్చుంది.

ఆమె రాసుకున్న ఇంటిమేట్ సెంటు ఇంపుగా రైలుపెట్టె ఆక్రమించుకుంది.

మధు ఆమెను కన్నార్పకుండా చూస్తున్నాడు. ఆమెతో ఎలాగైనా మాట్లాడాలనే తపన కొండలాగా పెరిగిపోతూంది.

ఆమె మధును చూసి నవ్వింది.

మధు గుండె సంతోషంతో గింజుకుంది.

"మీ పేరు?" నవ్వుతూ అడిగిందామె.

"మధు!" చురుకుగా జవాబిచ్చాడు.

"లాలీ నేమ్ ... మై నేమ్ ఈజ్ రోజీ!" పకపకా నవ్వుతూ చెప్పిందామె.

ఆమె నవ్వినప్పుడు కెమెరా ఉంటే ఒక్క క్లిక్ కొట్టేసేవాడు గానీ, ఆ అదృష్టం దక్కలేదు. ప్రయా

ణాలు చేసేటప్పుడు కెమెరా దగ్గర పెట్టుకోలేని తన బుద్ధితక్కువ తనానికి తనకే అసహ్యం వేసింది.

తనూ శ్రుతి కలుపుతూ సన్నగా నవ్వి, "ఏ వూరు వెళుతున్నారు?" అని అడిగాడు మధు.

"విశాఖపట్నం!" అంది దామె.

"అక్కడ ఎవరున్నారు?"

"మా బాబాయిగారు ఉన్నారు!"

ఇంత మంచి సమయంలో అటువంటి మాటలతో సంభాషణ పొడిగించడం ఇష్టం లేదు మధుకు.

"మీ శారీ చాలా బాగుందండి!" అన్నాడు సంభాషణ మారుస్తూ మధు.

ఆమె వెంటనే సకుకునని నవ్వింది, 'మరపురాని కథ'లో వాణిశ్రీలా.

"నేనేం చేసినా బాగుంటుంది."

"శారీ చాలా అందంగా ఉంది!"

"మీకు తెలియదుగాని, నేను అందాన్ని ఆరాధించే మనిషిని. ఎవరో తెలియని మూర్ఖులు అందాన్ని వ్యతిరేకిస్తారు. కాని, అందమే ఆనందమన్న సంగతి మీకు తెలుసు ననుకుంటా!"

ఒక్కసారి ఆమెను మాట్లాడిస్తే ఎంత చక్కగా కలిసి మాట్లాడేస్తుంది! తన అదృష్టానికి తనే మురిసిపోయాడు మధు.

ఆమె అందమైనది, ఆమె మాటలు అందమైనవి, ఆమె చూపులు అందమైనవి.

ఇప్పుడు మధు ఆనందమయుడు.

మధు ఆమె మాటలు వినాలని కుతూహల పడుతూ, "అసలు అందంగా ఉన్నవాళ్ళు ఎలా తయారైనా అందంగానే కనపడతారు. మరి అంద విహీనుల సంగతి!" అన్న సందేహం వెలిబుచ్చాడు.

"మీ ప్రశ్నలోనే జవాబుంది. అసలు అంద విహీనమైనదంటూ ఈ ప్రపంచంలోనే లేదు. కేవలం మనం చూసే దృష్టిలోనే ఉంది. ఇకపోతే, ఎంత అందవిహీనులైనా నేడు బజార్లో అమ్మబడు తున్న ఎన్నో రకాల పౌడర్లు, క్రీములు వాడి అందాన్ని కొని తెచ్చుకోవచ్చు ... అవును, అడగడం మరిచాను— మీ రే వూరు వెళుతున్నారు?"

"హైదరాబాద్."

"అక్కడ ఎవ రున్నారు?"

"ఎవరూ లేరు. మెడికల్ రిప్రెజెంటేటివ్‌గా ఉద్యోగం వచ్చింది. డ్యూటీలో జాయిన్ కావడానికి వెళుతున్నా. మీరు చాలా అందంగా ఉంటారు" అన్నాడు మధు.

"ఇలా చాలా మంది అన్నారు" అంది ఆమె ముసిముసిగా నవ్వుతూ. హాండ్‌బాగ్‌లోంచి మిర్రర్ తీసి ఒకసారి తన ప్రతిబింబాన్ని చూసుకుంటూ జుత్తు సవరించుకొంది.

"ఆ సంగతి నాకు తెలియదుగాని, నా మనసులో ఉద్దేశం అది." ఆమె కళ్ళలోకి సూటిగా చూస్తూ అన్నాడు మధు.

ఆమె కూడా మధువైపు చురుగ్గా చూసి, "మీరు కూడా చాలా అందంగా ఉంటారు" అంది హాండ్ మిర్రర్ బాగ్‌లో పెట్టుకుంటూ

ఆ మాట విని మధు మనసులో పది టన్నుల పెరిగాడు. ఇదే మాట కాలేజీ చదివే రోజుల్లో ఎంతోమంది అన్నా, ఆ మాట సంతృప్తినిచ్చేదికాదు. అలాంటిది ఒక అందమైన అమ్మాయి తనను అందగాడని మెచ్చుకుందంటే జీవితంలో ఇంకేమిటి కావాలి?

"నిజంగా నేను అందంగా ఉన్నానా?" ఆమె నోటి నుండి మరొకసారి ఆలకించాలని తాపత్రయ పడుతూ అడిగాడు మధు.

"నిజం" అంటూ ఆమె నవ్వింది.

ఇద్దరి మధ్య కొన్ని క్షణాలు నిశ్శబ్దంగా దొర్లాయి.

చందమామ విసిరే చల్లని జల్లు, చల్లని గాలి, దూరంగా సెల్యూట్ కొట్టి వెళ్ళిపోతున్న దీప స్తంభాలు, అక్కడక్కడ సరస్సులో చందమామ ప్రతిబింబం ప్రశాంతత ఇద్దరూ చూస్తూ ఉండి పోయారు.

మధు ఆమెవైపు తిరిగి ఆమె ముఖ కవళికలు పరిశీలిస్తున్నాడు. చల్లగాలికి ఉంగరాల జుట్టు రేగి ముఖమంతా పడుతూంది. పెదవుల మీద చిరునవ్వు చిందులు వేస్తూంది.

'అబ్బా! ఎంత అందంగా ఉంది!' అని మనసులో మరొకసారి అనుకున్నాడు మధు.

ఏదో స్టేషన్‌లో బండి ఆగింది.

పై బెర్తు మీద నుండి ముసలాయన దిగి కాఫీ బాయ్‌ని పిలిచి మూడు కాఫీలు తీసుకుని, మధుకు ఒక కాఫీ ఆఫర్ చేశాడు.

'నో. థాంక్స్' అందామనుకున్నాడు మధు. కాని, ఆకాఫీ కప్పు ఆమె అందుకొని అందించటంలో మహా భాగ్యంగా తోచింది.

కాఫీ కప్పుతోబాటు, ఆమె చేతివ్రేళ్ళు తగిలాయి. 'అబ్బా... ఎంత సుకుమార శరీరం!' ముసలాయన చూడకుండా ఆ వేడి కాఫీ కప్పును ముద్దు పెట్టు కున్నాడు మధు. కాఫీ కప్పు చుర్రుమనడంతో బిర్రబిగుసుకుపోయాడు.

ఆమె అది గమనించినట్టుంది. ఒక చిరునవ్వు విసిరింది.

కాఫీలు పూర్తి అయ్యాక ముసలాయన మధు క్షేమసమాచారాలన్నీ తెలుసుకున్నాడు. ఇదే అదనను కొని "విశాఖపట్నంలో మీ అడ్రెస్ ఇవ్వండి" అన్నాడు మధు. జేబులో నుండి కాగితం ముక్క తీసి అడ్రెస్ వ్రాసి మధు కిస్తూ, "విశాఖపట్నంలో చినవాల్టేర్ దగ్గరికి వచ్చి ఈ అడ్రెస్ అడిగితే ఎవరైనా చెబుతారు" అన్నాడు ముసలాయన.

అడ్రెస్ సంపాదించినందుకు మధు మరికాస్త సంతోషించాడు. ముసలాయన కూడా హైదరాబా దులోమధు బసచేసే హోటల్ అడ్రెసు తీసుకున్నాడు.

తనకు నిద్ర వస్తూందంటూ ఆవలిస్తూ పై బెర్తు మీదకు చేరుకున్నాడు ముసలాయన.

ఆమె మరొకసారి హాండ్‌బాగ్‌లోంచి మిర్రర్ తీసి తన ప్రతిబింబాన్ని చూసుకుంది. తన లిప్‌స్టిక్‌ని సరి చేసుకుంది. పాంకీతో ముఖమంతా తుడుచుకొని పౌడర్ అద్దుకొంది.

మధు ఆమె అందాలను ఆరాధిస్తూ కూర్చు న్నాడు. ప్రతి క్షణం ఆమె అందం మీద ఎంత శ్రద్ధ చూపిస్తూందో అంచనా వేసుకుంటున్నాడు.

ముసలాయన నిద్రపోయినట్టుగా గురక వినిపిస్తూంది.

గ్రీన్‌సిగ్నల్‌తో రైలుబండి పరుగెత్తినట్టు మధు ప్రేమ ముసలాయన గురకతో ఉరకలు వేస్తూ ఆమె వైపు పరుగెత్తింది.

"రోజీ! ఐ లవ్ యూ!' అన్నాడు ఆమె చేతులు పట్టుకుంటూ.

"రియల్లీ!" అందామె చేతులు విడిపించుకుంటూ.

"ష్యూర్!"

ఆమె వదనం సిగ్గుతో తొణికిసలాడింది. జడలోని మల్లెలు ముసిముసిగా నవ్వుకున్నాయి.

ఆమె మవునంగా మధు పక్కకువచ్చి కూర్చుంటూ "మధూ! ఐ లవ్ యూ!' అంది.

కంపార్టుమెంటు అంతా నిద్రావస్థలో ఉంది.



ముసలాయన కుంభకుర్ణుడి తాతలా గురక పెడుతున్నాడు.

పెదవుల మీద చూపుడువేలు పెడుతూ—"ముద్దియ్యనా?" అని సంజ్ఞ చేశాడు మధు.

రోజీ తన మోమును ఒకసారి సిగ్గు తెరలలోకి దించుకుని "ఎంతాశ!" అంది.

మధు గోముగా ఆమెను దగ్గరగా పట్టుకొని ముద్దు పెట్టుకున్నాడు.

వీరిద్దరి ప్రణయాన్ని చూసినట్టుగా రైలు పెద్దగా కూత పెట్టింది.

ముసలాయన దగ్గుతూ పక్కకు తిరిగి పడుకున్నాడు.

ఆయన లేస్తే బాగుండదని, రోజీని ఆమె సీట్లోకి వెళ్ళి కూర్చోమన్నాడు మధు.

రోజీ ఆమె సీట్లోకి వెళ్ళిపోతూ, "ఐ లవ్ యూ, మధూ!" అంటూ అతని బుగ్గను చిదిమి ముద్దు పెట్టుకుంది.

మధు ఆనందసాగరంలో మునిగి తేలుతున్నాడు.

"మీరు తప్పకుండా విశాఖపట్నం వచ్చి నుమ్మల్ని కలవాలి! ఒట్టేయండి!" అంటూ చేయి చాపింది రోజీ.

"తప్పకుండా..." ఆమె చేతిలో చెయ్యి వేశాడు మధు.

దూరంగా విశాఖపట్నం స్టేషన్ దగ్గరపడుతున్నట్టుగా మిణుకు మిణుకు మంటూ దీపాలు కనబడుతున్నాయి. ముసలాయన లేచి వాచీ చూసుకొని బెర్తు మీద నుండి క్రిందికి దిగి రోజీ పక్కను కూర్చుని మధును పరిశీలనగా చూశాడు.

విశాఖపట్నం స్టేషన్ అప్పుడే వచ్చేసినందుకు కసిగా తిట్టుకున్నాడు మధు.

రైలు వాల్టేర్ స్టేషన్‌లో ఆగింది.

రోజీ ముసలాయన వెంట దిగిపోతూ, "తప్పకుండా రండి" అంటూ చిన్నగా గిల్లి నవ్వుతూ వెళ్ళిపోయింది.

ఆమె వెళ్ళినవైపే కిటికీలోనుండి చూస్తూ, ఆమె నవ్వే నగుమోమును నెమరువేస్తూ కూర్చున్నాడు మధు.

ఇప్పుడు మధు హృదయంలో వసంత, రాగిణి, రమణి—మరెవరూ లేరు, ఒక్క రోజీ తప్ప.

తప్పకుండా రోజీనే పెళ్ళి చేసుకోవాలని నిర్ణయించుకున్నాడు.

• • •

మధు డ్యూటీలో జాయిన్ అయి వారం రోజులు కావస్తోంది.

ఒక రోజున తన పేరున వచ్చిన ఉత్తరాన్ని చదవ నారంభించాడు.

"చిరంజీవి మధుకు,

రఘుపతి దీవించి వ్రాయునది. రఘుపతి అంటే ఎవరో అని అనుకుంటున్నావా? ఆ రోజు ట్రెయిన్‌లో నీతో మాట్లాడిన రోజీ తండ్రిని.

నువ్వు మా రోజీని ఇష్టపడ్డావ్. నీక్కూడా అందమైన మనుషుల్ని ఆరాధించే స్వభావమున్నట్టు కనిపించింది.

ఇక్కడ నీకు కొన్ని విషయాలు చెప్పాలి.

అందాన్ని ఆరాధించడం తప్పు కాదు కాని, ఆ ఆరాధనలోనే కాలం గడపడం ఎంతైనా తెలివి తక్కువతనం. ధేనికైనా ఒక హద్దు ఉంటుంది. ఆ హద్దు దాటిన మనం ఎలా దిగజారిపోతున్నామో మనకే తెలియదు. ఈ కారణంవల్లనే నేటి యువతరంలో కొంతమంది అందంగా తయారు కావడానికి వెర్రితలలు వేస్తూ చూసేవాళ్ళకు అసహ్యంగా కనిపిస్తున్నారు! మనిషి అందంగా తయారుకావడం కన్నా, మనసును అందంగా తయారు చేసుకోవడం ఎంతో ముఖ్యం.

బ్రౌనింగ్ ఏమన్నాడో తెలుసా?'అతి సామాన్యము, సహజము అయిన అందమే అన్నిటికన్నా గొప్పది. అందుకు కారణం—అది భగవంతుని నిర్మాణం! అందువల్ల మనకు లేని అందం కొని తెచ్చుకోవటం వల్ల ఎన్నటికీ రాదని తెలుసుకో!'

ఇప్పు డొక ముఖ్య విషయం—మా అమ్మాయి రోజీ నీలాగునే అందం పేరు చెప్పి వెర్రి తలలు వేసి పిచ్చిదిగా తయారయింది. ఆమెను విశాఖపట్నం పిచ్చాసుపత్రికి తీసుకు వెళుతున్నప్పుడే నువ్వు ఆమెను చూడడం తటస్థించింది. ఆమె చేష్టలు, నవ్వుబట్టి ఇప్పటికైనా తెలుసుకో.

ఆఖరిసారిగా ఒక్క మాట.

మందులమ్మే ఉద్యోగంలో చేరావు. అయితే, నువ్వు మాత్రం మందులు తిని బ్రతకకూడదని నా కోరిక.

ఇట్లు,
నీ శ్రేయోభిలాషి,
రఘుపతి."

★